ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 12 ఆగస్టు 2024 | 3



నేడు గ్రీవెన్స్

అమలాపురం టౌన్, ఆగస్టు 11: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు.



అన్నదాత ఆనందం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):

గత రబీ సీజన్‌లో ధాన్యం విక్రయాలు చేపట్టి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం ఎదురుచూపులు చూస్తున్న వేల మంది రైతులకు ఇది శుభవార్త. పాత బకాయిలను అందించడానికి సోమవారం రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో సోమవారం పర్యటించనున్నారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లో జరిగే ఒక కార్యక్రమంలో రైతులకు ధాన్యం బకాయిలను అందజేయనున్నారు. ధాన్యం బకాయిలు విడుదలవుతున్నాయన్న సమాచారం తెలియడంతో రైతులంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు బకాయిల పంపిణీ

కోనసీమ జిల్లాలో రబీ పంటకు సంబంధించి 19,652 మంది రైతుల నుంచి ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు చేశారు. వారికి రూ.355.88 కోట్లను అందించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 10,823 మంది రైతులకు సంబంధించి రూ.201.25 కోట్లను రైతులకు పంపిణీ చేశారు. ఇక మిగిలిన 8,829 మంది రైతులకుగాను రూ.192 కోట్లను సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో గల గోదావరి భవన్‌లో జరిగే కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ బకాయిలను అందించనున్నట్టు సమాచారం. ఇందు కోసం సివిల్ సప్లయ్స్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

- నేడు ధాన్యం బకాయిల విడుదల
- మొత్తం రూ.192 కోట్లు పంపిణీ
- మంత్రి నాదెండ్ల ఆధ్వర్యంలో కార్యక్రమం
- అన్నదాతల హర్షాతిరేకాలు

రైతులకు సంబంధించిన బకాయిల విడుదల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం కొలువుదీరిన పక్షం రోజుల నుంచే వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, వారి అనుచర గణాలతో పాటు రైతు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అమలాపురంలో పలు పర్యాయాలు ఆందోళనలు జరిగాయి. ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఆందోళనలు చేపట్టిన విషయం పాఠకులకు విదితమే. అయితే సివిల్ సప్లయ్స్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులకు అందాల్సిన రూ.674 కోట్ల బకాయిలను అందజేయడానికి చర్యలు చేపట్టారు. దాంతో ఇప్పటి వరకు ఆందోళనలో ఉన్న రైతులకు ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే గత ప్రభుత్వంలో సేకరించిన ధాన్యం బకాయిలను తక్షణమే విడుదల చేసి కష్ట కాలంలో ఉన్న రైతులను ఆదుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వానికి కోనసీమలోని రైతు సంఘాల నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఇదిలా ఉండగా పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన కీలక నేత అయిన నాదెండ్ల మనోహర్ మంత్రి హోదాలో తొలిసారిగా కోనసీమకు రానుండడంతో ఆ పార్టీకి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు స్వాగత సత్కారాలు చేయడంలో నిమగ్నమయ్యారు. అపూర్వ రీతిలో స్వాగతం పలకాలని జనసేన పార్టీ నాయకులు అమలాపురం కేంద్రంగా సన్నాహాలు చేస్తున్నారు.





అభివృద్ధి దిశగా పిచ్చుకలంక

ఆత్రేయపురం, ఆగస్టు 11: ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీ చెంతనే అఖండ గోదావరి సోయగాలతో పిచ్చుకలంక పర్యాటక కేంద్రం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక పంచాయతీలోని సర్వే నెం 155లో పిచ్చుకలంక 56 ఎకరాలలో విస్తరించింది. గతంలో చంద్రబాబు హయాంలోనే ఈ పర్యాటక కేంద్రం చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి 56 ఎకరాలలో డ్రెడ్జింగ్ పనులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పిచ్చుకలంకను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. వారం రోజుల క్రితం ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పర్యటక ప్రాంతాన్ని పరిశీలించి జేసీకి నివేదించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ పిచ్చుకలంక ప్రాంతంలో పర్యటించారు. కాటన్ బ్యారేజీ చెంతనే అఖండ గోదావరి సోయగాలతో ఉన్న పిచ్చుకలంకను స్వయంగా పరిశీలించారు. దీనికి సంబంధించి రికార్డులను, మ్యాప్‌ను సర్వేయర్ ద్వారా తెలుసుకున్నారు. పిచ్చుకలంక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నారని ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మీవెంకన్న, తహసీల్దారు రాజేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాస్, ఆర్ఐ భవాని సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

- ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వ ప్రణాళికలు
- ఆర్డీవో నివేదికతో స్వయంగా పర్యటించి పరిశీలించిన కలెక్టర్ మహేష్‌కుమార్
- నిధులు మంజూరు కాగానే పనులు



పిచ్చుకలంక ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



ఘనంగా ముగిసిన బాలోత్సవం

వివరాలు 6లో

నెల్లూరులో చిక్కిన కేటుగాడు

- బాలికలిద్దరూ సురక్షితం
- నేడు రాజమహేంద్రవరం తీసుకొచ్చే అవకాశం
- సాంకేతిక సహాయంతో గుర్తించిన పోలీసులు

5లో

14 ఎక్స్‌ప్రెస్ రైళ్ల పునరుద్ధరణ

వివరాలు..5లో




ఘనంగా జన్మనక్షత్ర పూజలు

అంతర్వేదిలో భక్తుల రద్దీ

అంతర్వేది, ఆగస్టు 11: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని నక్షత్ర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత అర్చకులు బంగారు కలశను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. 108 కలశలతో స్వామివారి విశేష అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అష్టోత్తర శత కలశాభిషేకం పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో జరిగిన నారసింహ సుదర్శన హోమం, నిత్యాన్నదానంలో సుమారు 4వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

రేషన్ డీలర్ల సంబరాలు

రావులపాలెంలో పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

రావులపాలెం, ఆగస్టు 11: రేషన్ షాపుల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే సంకేతాలు రావడంతో రేషన్ డీలర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లీలామాధవరావు పిలుపు మేరకు చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీలకు రేషన్ డీలర్లు పాలాభిషేకం చేశారు. రావులపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఆదివారం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, సివిల్ సప్లై శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, లీలామధవరావు చిత్రపటాలకు రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట మండలాలకు చెందిన రేషన్‌డీలర్లు పాలాభిషేకం చేశారు.

వైసీపీ హయాంలోనే అంబేడ్కర్‌కు అవమానాలు

ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

6లో

రాజ్యాంగం ఉన్నంత కాలం

వర్గీకరణ జరగదు

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక నిరసన సభలో వక్తలు



మాట్లాడుతున్న పండుల రవీంద్రబాబు

అమలాపురం టౌన్, ఆగస్టు 11: దేశంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఉన్నంత కాలం ఎస్సీ వర్గీకరణ జరిగే విషయం కాదని మాజీ ఎంపీ పండుల రవీంద్రబాబు అన్నారు. ఎస్సీ వర్గీకరణ వైపు మొగ్గు చూపి ఎన్డీయే ప్రభుత్వం తన గొయ్యి తానే తీసుకుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు. న్యాయ పోరాటానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పండు అశోక్‌కుమార్ అధ్యక్షతన నిరసన సభ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత మాల మృత వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. పీవీ రావుతో పాటు వర్గీకరణ ఉద్యమంలో అశువులు బాసిన నాయకుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన నిరసన సభలో మాలమహానాడు నాయకులు కారెం శివాజీ, జగడం సత్యనారాయణ, ఎంఏకే భీమారావు, డి.రాములు, నామాడి శివాజీ, పోతుల నాగరాజు, పెయ్యల శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ మనువాదుల కుట్రలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని ఆరోపించారు. కేంద్రంలోను, రాష్ట్రంలోను లక్షలాది బ్లాక్ లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నా ఇంత వరకు భర్తీ చేయలేదన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాడాలన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం జోలికి వస్తే సహించేది లేదన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు మాలలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. మనువాదుల కుట్రలో మందకృష్ణ మాదిగ పావుగా మారిపోయారని విమర్శించారు. త్వరలోనే మందకృష్ణకు జ్ఞానోదయం కావడం తథ్యమన్నారు. ఉద్యమాల గడ్డగా పేరొందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచే కేంద్రానికి ఉద్యమ సెగ తగలడం తథ్యమని హెచ్చరించారు. వర్గీకరణపై న్యాయమూర్తుల తీర్పును ఐఎస్ మల్లేశ్వరరావు వివరించారు. చీకురుమెల్లి కిరణ్‌కుమార్, పుణ్యమంతుల రజనీ, జక్కల అరుణ్‌కుమార్, ఉండ్రు బాబ్జి, చింతా రామకృష్ణ, ఏనుగుపల్లి కృష్ణ, నక్కా సంపత్‌కుమార్, నాతి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.



కార్యకర్త ఆత్మహత్యాయత్నం

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బహిరంగ సభ జరుగుతుండగా అందరూ చూస్తుండగా అల్లవరం మండలం తాడికోన గ్రామానికి చెందిన బడుగు నాగార్జున ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తదితరులు సకాలంలో స్పందించి ఆ వ్యక్తిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. హుటాహుటిన పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఎన్నేళ్లో వేచిన ఉదయం

47 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గురువులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి, ఆగస్టు 11: కాకినాడ జిల్లా కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1976-77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఎవరెవరు ఏమి చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. దాదాపు 47 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఎంతో సంతోషంగా గడిపారు. కుటుంబసమేతంగా హాజరైన వారంతా వారి పిల్లలను ఒకరికొకరు పరిచయం చేసి సందడి చేశారు. రోజంతా తోటి మిత్రులతో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువాలు కప్పి సత్కరించి వెండి ఆభరణాలు, జ్ఞాపికలు అందజేసి గౌరవించారు.



పది అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

ఒకే పోగుతో పది అడుగుల జాతీయ జెండా

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: ఒకే పోగుతో తయారు చేసిన పది అడుగుల జాతీయ జెండాను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ జెండాను పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరం గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు రుద్రాక్షల సత్యనారాయణ తయారు చేశాడు. ఒకే పోగుతో జాతీయ జెండాను తయారు చేయడం ఉభయ గోదావరి జిల్లాల వాసులకు గర్వకారణమని దుర్గేష్ అన్నారు. రాకా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జీవీ రమణ, కోశాధికారి సూరపురెడ్డి తాతారావు పాల్గొన్నారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం

ధవళేశ్వరం, ఆగస్టు 11: గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. ఆదివారం రాత్రి ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 7.10 అడుగులుగా నమోదు కాగా 4,08,157 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తున్నది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 2వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1500 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.



14 ఎక్స్‌ప్రెస్ రైళ్ల పునరుద్ధరణ

సామర్లకోట, ఆగస్టు 11: ఇటీవల పలు కారణాలతో, విజయవాడ రైల్వే కారిడార్ ఆధునికీకరణ పనులతో అటు విశాఖ వైపు, ఇటు విజయవాడ వైపు రద్దు చేసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో 14 రైళ్ల రాకపోకలను పునరుద్ధరిస్తూ రైల్వే అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం రాత్రి సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారికి ఆదేశాలు అందాయి.

- విశాఖపట్టణం-కడప-విశాఖ మధ్య రాకపోకలు సాగించే 17488, 17487 నంబర్లు గల తిరుమల ఎక్స్‌ప్రెస్.
- విశాఖ-గుంటూరు-విశాఖ మధ్య రాకపోకలు సాగించే 22701, 22702 నంబర్లు గల ఉదయ్ ఎక్స్‌ప్రెస్.
- విజయవాడ-విశాఖపట్టణం-విజయవాడ మధ్య రాకపోకలు సాగించే 12718, 12717 నంబర్లు గల రత్నాచల్ ఎక్స్‌ప్రెస్.
- మచిలీపట్టణం-విశాఖపట్టణం-మచిలీపట్టణం మధ్య రాకపోకలు సాగించే 17219, 17220 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్.
- గుంటూరు-విశాఖపట్టణం-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే 17239, 17240 నంబర్లు గల సింహాద్రి ఎక్స్‌ప్రెస్.
- తిరుపతి-విశాఖపట్టణం-తిరుపతి మధ్య రాకపోకలు సాగించే 22708, 22707 నంబర్లు గల డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్.
- రాజమహేంద్రవరం-విశాఖపట్టణం-రాజమహేంద్రవరం మధ్య రాకపోకలు సాగించే 07466, 07467 నంబర్లు గల మెమూ.
- గుంటూరు-రాయగడ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే 17243, 17244 నంబర్లు గల రైళ్లు.
- విశాఖపట్టణం-ఎస్ఎంవీబీ బెంగళూరు-విశాఖపట్టణం మధ్య రాకపోకలు సాగించే 08543, 08544 నంబర్లు గల సూపర్‌ఫాస్ట్.

వీటన్నిటినీ ఈ నెల 18వ తేదీ నుంచి పునరుద్ధరిస్తారు. ఆయా ప్రదేశాలకు ప్రయాణించే ప్రయాణికులు సదరు రైళ్లల్లో రిజర్వేషన్ టిక్కెట్లు పొందేందుకు బుకింగ్ కౌంటర్ల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారి కోరారు.



దాతకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఈవో కిశోర్‌కుమార్

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 11: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్క రోజు ఆదాయం రూ.2,73,809 లభించింది. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి యానానికి చెందిన గుబ్బల పరంజ్యోతి-హిమపావని దంపతులు రూ.1.16 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

అంతర్వేది, ఆగస్టు 11: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని మలికిపురం భూపతివారిపేటకు చెందిన గుబ్బల శేఖర్ బాబు-యమున దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.





జేసీ మాల్ ఫ్యాషన్ షోరూమ్‌ను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి శ్రీలీల, పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరంలో జేసీ మాల్ షోరూం

ప్రారంభించిన సినీ నటి శ్రీలీల, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 11: నగరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో ఏర్పాటుచేసిన జేసీ మాల్ ఫ్యాషన్ షోరూమ్‌ను వర్ధమాన సినీ తార శ్రీలీల, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ప్రారంభించారు. వస్త్ర ప్రపంచంలో తలమానికంగా అలరారుతున్న ఇంత పెద్ద షాపింగ్ మాల్‌ను రాజమహేంద్రవరంలో ప్రారంభించిన జేసీ యాజమాన్యాన్ని మంత్రి దుర్గేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్‌పర్సన్ జమునారెడ్డి మాట్లాడుతూ తాము ఇప్పటికే తెలంగాణలో పలు ఫ్యాషన్ మాల్స్ ప్రారంభించామని, అవన్నీ కస్టమర్ల అభిమానాన్ని, ఆదరణను చూరగొన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా రాజమహేంద్రవరంలో ప్రారంభించామని చెప్పారు.

సినీ నటి శ్రీలీల మాట్లాడుతూ జేసీ మాల్ ఫ్యాషన్ షోరూంలను తెలంగాణాలో చూశామన్నారు. ముచ్చటైన కలర్స్ మహిళలు మెచ్చే డిజైన్లతో అందరికీ అందుబాటులో ఉండే ధరలతో మంచి స్పందన వచ్చిందని, రాజమహేంద్రవరంలో షోరూమ్‌ను కూడా ఆదరించాలని కోరారు.

నెల్లూరులో కేటుగాడు!

▸ సాంకేతిక సహాయంతో గుర్తించిన పోలీసులు ▸ బాలికలిద్దరూ సురక్షితం ▸ నేడు రాజమహేంద్రవరం తీసుకొచ్చే అవకాశం



రాజమహేంద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన ఇద్దరు బాలికలను ఓ యువకుడు ట్రాప్ చేసి తీసుకెళ్లడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఆ కేటుగాడిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారని, బాలికలు సురక్షితంగా ఉన్నారని తెలుస్తోంది. విజయ నగరం జిల్లా బత్తిరాజేరు మండలం పెదమన్నాపురానికి చెందిన మారోజు వెంకటేశ్ అదే ఊరికి చెందిన ఓ 17ఏళ్ల బాలికతో గత ఏడాది జూలైలో ఉడాయించాడు. దీనిపై అక్కడి పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ బాలికను వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ ధవళేశ్వరం చేరుకున్నాడు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానం టూ కల్లబొల్లి మాటలు చెప్పి డబ్బులు లాగేసి ఆ ఊరి నుంచి మరో ఊరికి వెళ్లిపోవడం ఇతడికి అలవాటుగా మారింది. ఈ క్రమంలో ధవళేశ్వరంలో తాను ఉంటున్న ఇంటి పక్కన ఉన్న ఒక మహిళతో పరిచయం పెంచు కున్నాడు. బుద్ధిమంతుడిగా నటిస్తూ దగ్గరయ్యాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కొద్ది నెలల తర్వాత రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను తీసుకొని విజయవాడ వెళ్లి ఓ చోట బస కల్పించాడు. ధవళేశ్వరం వచ్చి పిల్లాడిని తీసుకెళ్లి తల్లి వద్దకు చేర్చాడు. హాస్టల్‌లో దింపుతానని ఆ ఇద్దరు బాలికలకూ మాయమాటలు చెప్పి అతడి వెంట తీసుకెళ్లాడు. వాళ్లు హాస్టల్‌కి చేరకపోవడంతో తల్లి చేసిన ఫిర్యాదుతో గత నెల 30న ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో తల్లి రెండు రోజుల క్రితం కాకినాడ జిల్లా పిఠాపురం వెళ్లి టీడీపీ ఇన్‌చార్జి వర్మకు విన్నవించింది. ఆయన ఎస్పీతో మాట్లాడడంతో దర్యాప్తులో వేగం పెరిగింది. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ కార్యాలయంలోని సైబర్ సెల్ నిరంతర పర్యవేక్షణ చేసింది. దీంతో రెండు రోజుల్లోనే కేసు ఓ కొలిక్కి వచ్చింది. సాంకేతికత సహాయంతో బాలికలతో ఆ నిందితుడు నెల్లూరులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై వాళ్లు అక్కడి నుంచి మరోచోటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్న అనంతరం వెంకటేశ్‌తో పాటు ఆ బాలికలను చాకచక్యంగా పట్టుకున్నారు. ముగ్గురినీ సోమవారం రాజమహేంద్రవరం తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. బాలికలను తీసుకెళ్లడంలో నిందితుడి ఉద్దేశ్యం వెల్లడి కావాల్సి ఉంది. కాగా మిస్సింగ్ కేసుల్లో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనడానికి ఈ కేసు తాజా ఉదాహరణనే ఆరోపణలు వినవస్తున్నాయి. పది రోజుల్లో సాధ్యం కాని పని ప్రజాప్రతినిధుల హెచ్చరికలతో కేవలం రెండు రోజుల్లో ఎలా సాధ్యమైందని కొందరు ప్రశ్నిస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, ఆగస్టు 11: కాకినాడ జిల్లా పెద్దాపురంలో మరిడమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే అధిక సంఖ్యలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సహాయ కమిషనరు చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి



తుని రూరల్/అన్నవరం, ఆగస్టు 11: తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నవరం రైల్వే స్టేషన్ 3వ నెంబరు ప్లాట్‌ఫామ్ శివారున గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనాస్థలాన్ని తుని రైల్వే పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ కోరారు.

ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడకు

నిరంతర కృషి

యూపీఈఐఎఫ్ న్యాయ సలహాదారు శ్రీవిజయ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవిజయ్

కాకినాడ రూరల్, ఆగస్టు 11: ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడ కోసం నిరంతరం కృషి చేస్తానని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఐఎఫ్) రాష్ట్ర న్యాయ సలహాదారు, హైకోర్టు న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. కాకినాడ అశోక్‌నగర్‌లోని ఎం ఎస్ఎన్ పాఠశాల ఆవరణలో యూపీఈఐఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫెడరేషన్ ఎప్పటికప్పుడు ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలపై పోరాటం చేస్తోందని, పాఠశాలల యాజమాన్యాలు విద్యారంగంలో పలు మార్పులు తీసుకురావాలని సూచించారు. కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్ మాట్లాడుతూ సంఘం బలోపేతం కావాలంటే ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎస్.శేషారెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాల కరస్పాండెంట్ ఉన్నతమైన విలువలతో హుందాగా వ్యవహరించాలని సూచించారు. విద్యారంగ సమస్యలపై శ్రీవిజయ్ చేస్తున్న పోరాటాన్ని అభినందించారు. అనంతరం పలు పాఠశాలల కరస్పాండెంట్లు లేవనెత్తిన సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించారు. సమావేశంలో ప్రగతి విద్యా సంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

గంజాయితో నక్కి... పోలీసులకు చిక్కి

▸ ఆరుగురి అరెస్టు ▸ 7.6 కిలోల గంజాయి స్వాధీనం

▸ రెండు మోటారు సైకిళ్లు సీజ్

కాకినాడ రూరల్, ఆగస్టు 11: కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సీఐ ఎన్‌డీ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ వి.మణికుమార్ సిబ్బందితో కలిసి కాకినాడ రూరల్ మండలం చీడిగ ఫ్లై ఓవర్ సమీపంలో గల ఖాళీ స్థలంలో గంజాయి రవాణా, అమ్మకం జరుగుతోందన్న సమాచారంతో శనివారం మధ్యాహ్నం దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 7.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని రెండు మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు వెల్లడించారు. కాకినాడ డివిజన్‌లో గంజాయి సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఏర్పాటుచేసిన ఒక బృందం గంజాయి రవాణా, అమ్మకాలపై పూర్తి నిఘా పెట్టిందన్నారు. ఇంద్రపాలెం పీఎస్‌లో కేసు నమోదు చేసి ఆ ఆరుగురిని రిమాండుకు పంపిస్తున్నామన్నారు. పాలెపు సతీష్‌పై కాకినాడ 1, 2 పోలీస్ స్టేషన్లలో ఆరు దొంగతనం కేసులు, రెండు గంజాయి కేసులు, కర్రి శామ్యూల్, మరువాడ శ్రీనివాస్, బోయి వెంకటరమణలపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో మర్డర్ కేసు వున్నాయి. మరో ఇద్దరు కలపరెడ్డి శివకుమార్, వీరిని ప్రభుతేజ అని డీఎస్పీ వివరించారు.



తలుపులమ్మ అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

'లోవ'లో శ్రావణ శోభ

తుని రూరల్, ఆగస్టు 11: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం శ్రావణ శోభ సంతరించుకుంది. పెద్ద ఎత్తున మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. 15వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు. దర్శనాంతరం ఆలయ ప్రాంగణంలో వంటా-వార్పుచేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం రూ.4.67 లక్షల ఆదాయం వచ్చింది.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి గుర్తింపు

కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగింత

అన్నవరం, ఆగస్టు 11: కాకినాడ జిల్లా అన్నవరం రైల్వే స్టేషన్‌లో ఒక బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని చూసి ప్రయాణికులు జీఆర్పీ హెచ్‌సీ శ్యామ్‌కు సమాచారమిచ్చారు. ఆయన హుటాహుటిన స్టేషన్‌కు వచ్చి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. తన పేరు గాజుల స్వామి అని, పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి స్వగ్రామం అని, దగ్గర్లో ఉన్న రెస్టారెంట్‌లో పనిచేయమని తల్లిదండ్రులు అడిగితే ఇష్టంలేక బట్టలు సర్దుకుని వచ్చేశానని చెప్పాడు. అతడికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించినట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ చెప్పారు.



పాఠశాలకు పూర్వ విద్యార్థులు సామగ్రి వితరణ

ఐ.పోలవరం, ఆగస్టు11: ఐ.పోలవరం జడ్పీ ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు పాఠశాలకు రూ.1.60లక్షల విలువైన సామగ్రిని బహూకరించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం వీధి సురేష్‌బాబుకుసామగ్రిని అందించారు. పూర్వవిద్యార్థులను,గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. తుమ్మూరి బాపిరాజు, ఆకొండి కామేశ్వర రావు, విజ్జపు శ్రీనివాసరావు, రామేశ్వరపు శేషగిరి, నంబూరి గంగరాజు, విజ్జపు వీరనారాయణ, పెన్మెత్స శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల ఆందోళన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వ్యతిరేక పోరాట సమితి నాయకులు

ముమ్మిడివరం, ఆగస్టు11: ఎస్సీ, ఎస్టీ కులాలను వర్గీకరిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తూ ఎస్సీ వర్గీకరణ పోరాటసమితి ఆదివారం ముమ్మిడివరంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. కాశివానితూము సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు కాశి బాలమునికుమారి, దేవరపల్లి ఏడుకొండలు, మెండి కృష్ణబాబు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ రహదారిపై నిరసన వ్యక్తంచేస్తూ పెద్దవంతెన, హైస్కూలు, బళ్లగేటు, పోలీసుస్టేషన్ సెంటర్ల మీదుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతియుతంగా భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341,342లకు వ్యతిరేకంగా కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వాలు కుట్ర పూరితంగా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతూ ఎస్సీ, ఎస్టీ కులాల ఐక్యతకు భంగం కలిగించే విధంగా చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. వర్గీకరణ చేసే హక్కు కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణపై 2005లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణలోనికి తీసుకోకపోవడం చూస్తే నేటి తీర్పు రాజకీయ కుట్రలో భాగమని స్పష్టమవుతుందన్నారు. వియ్ వాంట్ జస్టిస్.. వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు అంటూ చంద్రబాబు, మోదీకి వ్యతిరేకంగా నిరసనకారులు నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. మాల మృతవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని అమరులైన మాలవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాశిజగపతిరావు, ముంగండ ఆశీర్వాదం, మట్టా రాహుల్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, కాశి లాజర్, పంతగడ నరసింహమూర్తి, కాశి రామకృష్ణ, నక్కా సర్వేశ్వరరావు, కాశిమూర్తి, బడుగు శ్రీరాములు, చెల్లి మధుబాబు, ఇసుకపట్ల శివకుమార్, నీలం చినబాబు, బుడితి శ్రీనుబాబు, నల్లాసూర్యప్రకాష్, పరగడ ధర్మేంద్ర, కాశి సిద్ధార్థకుమార్, అంబ్కేర్ యువజన, అభ్యుదయ, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లో జాతీయభావాన్ని పెంపొందించాలి

అయినవిల్లి, ఆగస్టు 11: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై (హర్ ఘర్ తిరంగా) జాతీయ జెండాను ఎగుర వేసేలా ప్రజల్లో జాతీయభావాన్ని పెంపొందించాలని బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు అన్నారు. అయినవిల్లి మండల కార్యవర్గ బీజేపీ సమావేశం మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. దీనిలో భాగంగా జాతీయ జెండాలతో బైకా ర్యాలీ నిర్వహించాలన్నారు. బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర జోనల్ ఇన్‌చార్జి కొల్లి సూర్యారావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, యనమదల వెంకటరమణ, పాటోలు శివ, గోకవరం రాజు, పసలపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాలతో ప్రదర్శన

మామిడికుదురు, ఆగస్టు 11: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాశర్లపూడిలంకలో ఆదివారం వందేమాతరం అంటూ జాతీయ పతాకాలతో ప్రదర్శన నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, స్థానికులు జాతీయ జెండాలను చేతబట్టి భారతమాతకు జేజేలు పలికారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రదర్శన నిర్వహించినట్టు సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు తెలిపారు. ఎంపీటీసీ చెరుకూరి పార్వతీదేవి, డ్వాక్రా యామినేటర్లు నాగమణి, అనూష, నిరీష, స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

ద్రాక్షారామ, ఆగస్టు 11: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ హర్‌ఘర్ తిరంగా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.సాయిరాం పిలుపు నిచ్చారు. ఆదివారం ద్రాక్షారామలో పార్టీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెయ్యల రాంబాబు, మండలాల అధ్యక్షులు సలాది వీరబాబు, అవసరాల రమణమూర్తి, దొంతంశెట్టి ఓం ప్రకాష్, యాంద్ర బుల్లబ్బులు, యువమోర్చా అధ్యక్షుడు ఎస్.సూర్య పాల్గొన్నారు. అలాగే రామచంద్రపురం పట్టణంలో 17వ వార్డులో ఇంటింటికి ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు జనసేన నాయకుడు వడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడ్డి బాలు, వడ్డి శివసాగర్‌నాయుడు, నల్లా రామ్మోహన్, నల్లా అనిల్, పెద్దిరెడ్డి దేవిప్రసాద్, విజయకుమార్, దిగుమర్తి అనిల్, కంపట్ల సత్యనారాయణ, వడ్డి అఖిల్, సాయిగౌతమ్‌రామ్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ అధికారుల పూజలు

అంతర్వేది, ఆగస్టు11: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్, రీజనల్‌మేనేజర్ ఉతుప్‌జోసఫ్, ఎస్‌జీఎం సంధ్యారాణి విచ్చేశారు. వారికి అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో విష్ణుభట్ల సుందరరావు, జిల్లా ఎల్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రావులపాలెం, ఆగస్టు 11: సమాజంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్టు చైర్మన్ న్యాయవాది బూసి విద్యాప్రసన్న అన్నారు. రావులపాలెంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మసీదు ప్రాంగణంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యాప్రసన్న మాట్లాడుతూ సమాజంలో ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అదే విధంగా సమాచార హక్కు చట్టాన్ని వినియోగించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ముప్పర్తి వెర్రియ్య, అప్న అంజుమాన్, బాషా, జహంగీర్, రహ్మతుల్లాష్, వలియుల్లాహ్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న 21మంది అరెస్టు

అమలాపురం టౌన్, ఆగస్టు 11: అమలాపురం నల్లవంతెన దిగువన జార్జి కార్నేషన్ క్లబ్‌లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పట్టణ పోలీసులు దాడి చేశారు. దాడిలో 21మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.48,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ క్రిస్టఫర్ ఆదివారం తెలిపారు.

గుర్తింపు కార్డులు రెన్యువల్ చేయించుకోవాలి

అంబాజీపేట, ఆగస్టు 11: భవన నిర్మాణ రంగ కార్మికులు గుర్తింపు రెన్యువల్ చేయించుకోవాలని ఏపీ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ట్రేడ్ యూనియర్ రాష్ట్ర అధ్యక్షుడు గళ్లా రాము అన్నారు. గంగలకుర్రులోని రావులమ్మ ఆలయం వద్ద తాపీ పనివార్ల సంఘం ఆధ్వర్యంలో రామును సత్కరించారు. ఆదివారం కార్మిక సంఘ అధ్యక్షుడు బొరుసు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాము మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు చిరతపూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి కుడుపూడి రమేష్, సహాయ కార్యదర్శి జయను వెంకటరమణ, ఊటాల రమేష్, చొల్లంగి పల్లంశెట్టి, పలివెల శ్రీనివాస్, మట్టపర్తి రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

అల్లవరం, ఆగస్టు11: బీజేపీనాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి మోకావెంకటసుబ్బారావు అన్నారు. అల్లవరంలో బీజేపీమండల అధ్యక్షుడు సుంకర సత్యసాయిబాబా అధ్యక్షతనఆదివారం సమావేశం జరిగింది. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి కట్టా నారాయణమూర్తి, గూడాల పుల్లయ్యశెట్టి, కామిశెట్టి వెంకటరత్నం, కట్టా జనార్ధన్, పాటి సత్తిరాజు, తోట విశాల్‌కృష్ణపటేల్, బండి శ్రీనివాస్, కంకిపాటి ఆదినారాయణ, పినిశెట్టి సుబ్బారావు, మంచిగంటి సూర్యారావు పాల్గొన్నారు.

'రాజ్యాంగానికి తూట్లు పొడిచిన ఘనత జగన్‌దే'



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, ఆగస్టు11: రాష్ట్రంలో వైసీపీ పాలనలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని బుట్టదాఖలు చేసి, రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేసిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. రాజధాని నడిబొడ్డున 30ఎకరాల విస్తీర్ణంలో అమరావతిలో చేపట్టిన స్మృతి వనాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారని ధ్వజమెత్తారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే రూ.170కోట్లతో విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అంబేడ్కర్ కంటే పెద్ద అక్షరాలతో నాటి సీఎం జగన్ పేరు పెట్టుకోవడం రాజ్యాంగ నిర్మాతను అవమానించడం కాదా అని ప్రశ్నించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనందరావు అధ్యక్షతన ఎస్సీ నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. అంబేడ్కర్ విదేశీ విద్యతో సహా 27సంక్షేమ పథకాలను రద్దుచేసి దళిత వర్గాలకు సంక్షేమ పథకాలను దూరంచేసిన దళిత ద్రోహి జగన్‌రెడ్డి అని ఆరోపించారు. సబ్‌ప్లాన్ నిధులు రూ.40వేలకోట్లు దారిమళ్లించిన మాటవాస్తవం కాదా అన్నారు. జగన్ పాలనలో 188మంది దళితులు హత్యకు గురయ్యారని, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు హత్యచేసి డోర్ డెలివరీ చేస్తే అటువంటి వ్యక్తిని పక్కనే పెట్టుకుని తిరిగింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఎస్సీ నాయకులు పొలమూరి ధర్మపాల్, మంద గెద్దయ్య, ఈతకోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొబ్బరి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చినకొత్తలంకలో సమావేశమైన కొబ్బరి కార్మికులు

ముమ్మిడివరం, ఆగస్టు 11: కార్మికుల, కర్షకుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాటం సాగించడంలో ట్రేడ్ యూనియన్ ముందుంటుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. చినకొత్తలంకలో ఆదివారం గణేష్ కొబ్బరికాయల లారీ ఎగుమతి, దిగుమతి జట్టు కూలీ సంఘ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కొబ్బరి కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. కొబ్బరి ఎగుమతి, దిగుమతి జట్టు సంఘాలకు నూతన వేతనఒప్పందం అమలు చేయాలన్నారు. వ్యాపారులు స్పందించి వారి డిమాండ్లు పరిష్కరించాలన్నారు. లేకపోతే కార్మికులంతా సమ్మె బాట పడతామని హెచ్చరించారు. వేతన ఒప్పందం గడువు ముగిసి ఏడాది దాటినా నూతన వేతన ఒప్పందం అమలు చేయడంలో వ్యాపారులు కాలయాపన చేయడం తగదన్నారు. కొబ్బరి ఎగుమతి, దిగుమతి జట్టు సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా రాయుడు సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా జి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా జి.అగ్గిరాముడు, జి.తాతారావు, ప్రధాన కార్యదర్శిగా ఆచంట ఆదినారాయణ, సహాయ కార్యదర్శిగా యడ్ల దుర్గాప్రసాద్, పచ్చిమాల రమణ కోశాధికారిగా గొల్లపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులుగా రెడ్డి సత్యనారాయణ, కటికదల సత్యనారాయణ, గుత్తుల నాగబాబు, మధుర వెంకటరమణ, గుత్తుల సత్యనారాయణ ఎన్నికయ్యారు.

రాయవరం ఎస్ఐగా బుజ్జిబాబు

రాయవరం, ఆగస్టు 11: రాయవరం ఎస్ఐగా పి.బుజ్జిబాబు నియమితులయ్యారు. మండపేటటౌన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ జి.నరేష్‌ను వీఆర్‌లో ఉంచారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీగా శ్రీనివాస్

మలికిపురం, ఆగస్టు11: జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీగా పడమటిపాలెం పీఈటీ అడబాల శ్రీనివాస్‌ను నియమిస్తూ డీఈవో ఎం.కమలకుమారి ఉత్తర్వులు ఇచ్చారు. 2024-25 నుంచి 2025-26వరకు తాను స్కూలు గేమ్స్ సెక్రటరీగా పనిచేసేందుకు డీఈవో ఉత్తర్వులిచ్చినట్టు తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు

ఆత్రేయపురం, ఆగస్టు 11: ర్యాలిలోఅనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకాంత్ ప్రారంభించారు. చిన్నారులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన యాదవ సంఘం నాయకులు

మలికిపురం, ఆగస్టు 11: రాజోలు తాలూకా శ్రీకృష్ణ యాదవసంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. యాదవ సంఘ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవ అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మందపాటి సత్యనారాయణ, నూనె రామకృష్ణ, మట్టా రామారావు, మన్నే సత్యనారాయణ, సంఘ సభ్యులు ఉన్నారు.

బాలోత్సవంతో పిల్లలకు నూతనోత్తేజం



కోనసీమ బాలోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, ఆగస్టు 11: నేటి పిల్లలు సెల్‌ఫోన్ గేమ్‌లకు బానిసలవుతున్న తరుణంలో ఇటువంటి బాలోత్సవాలతో వారికి నూతనోత్తేజం కలిగి భావిభారత పౌరులుగా తయారవుతారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మనం ట్రస్టు, జిత్రేంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజు జరిగిన కోనసీమ బాలోత్సవం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితం కోసం స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం పాశ్చాత్య పోకడలకు పిల్లలు ఆకర్షితులవుతున్న తరుణంలో సంప్రదాయబద్ధమైన బాలోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించడం సమాజంలో మార్పునకు నాంది పలుకుతుందన్నారు. బాలోత్సవంలో భాగంగా 66విభాగాల్లో పిల్లలు పోటీపడి ప్రతిభను ప్రదర్శించాలన్నారు. ఈపోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలేనన్నారు. అనంతరం పిల్లలకు బహుమతులు, ప్రశం సాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలోత్సవం అధ్యక్షుడు కర్రి కాశీవిశ్వనాథం, కట్టా వీరబాబు, మట్టపర్తి జితేంద్రకుమార్, యెండూరి పవన్‌కుమార్, గంగుమళ్ల రాజు, షేక్ అబ్దుల్‌సతార్, కె.మణి, వెత్సా సునీల్, నాయకులు బూసి జయలక్ష్మీభాస్కరరావు, ప్రముఖ శిల్పి రాజకుమార్ వడయార్, కంఠంశెట్టి శ్రీను, పాలూరి సత్యానందం, రెడ్డి రామకృష్ణ, ఎంఈవో ఎం.హరిప్రసాద్, ఎస్.ఆదిత్యాకిరణ్, తోట వెంకటేశ్వరరావు, అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను కార్మిక శాఖ పరిధిలోకి తీసుకువస్తా



చేనేత కార్మికులకు యంత్ర పరికరాలు అందిస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, ఆగస్టు 11: చేనేత కార్మికులను కార్మిక శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి కృషి చేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ఆదివారపుపేటలో క్లస్టర్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.52.80లక్షలతో సమకూర్చిన ఆధునిక యంత్ర పరికరాలు, వర్కు షెడ్స్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. వలసవెళ్లిన చేనేత కార్మికులను తిరిగి వచ్చేలా చేస్తామన్నారు. మూతపడిన మగ్గాలకు మంచిరోజులు వస్తాయన్నారు. మంత్రి లోకేశ్ చేనేత రంగంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రామచంద్రపురంలో చేనేత సహకార సంఘాలతో చర్చించి రామచంద్రపురంలో చేనేత బజారు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నూతనంగా నిర్మించిన వర్కుషెడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి కె.పెద్దిరాజు, అభివృద్ధి అధికారి ఎం.రాజు, ఎంపీపీ అంబటి భవానీ, సర్పంచ్, ఎంపీటీసీ, శివబాలయోగి చేనేత సహకార సంఘం సిబ్బంది, సభ్యులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌కు పూర్వ వైభవం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 11: ప్రభుత్వ సహకారం తీసుకుని రాష్ట్రంలో బాస్కెట్‌బాల్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సమావేశం తీర్మానించింది. ఆదివారం స్థానిక రాజగోపాల్ ఫంక్షన్ హాలులో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం విశ్రాంత డీఎస్పీ, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.మదన్ మోహన్ అధ్యక్షతన జరిగింది. బాస్కెట్‌బాల్ క్రీడకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సమావేశంలో తీర్మానించారు. నూతనంగా ఏర్పాటైన జిల్లాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం, వేసవిలో సీనియర్ కోచ్‌లతో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఉపాధ్యక్షుడు జి.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. సమావేశానికి హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కనకాల వెంకటేశ్వరరావు, మారిశెట్టి సత్యనారాయణ, టి.వి.ఎస్.రంగారావు, కె.పురుషోత్తమరావు, బి.టి.వర్మ, ఎన్.వి.వి.శ్రీనివాసరావు, ఖాసింఖాన్ పాల్గొన్నారు.

వెండి తొడుగు బహూకరణ

యానాం, ఆగస్టు 11:యానాంబైపాస్ బాలయోగి వారధి సమీపంలోని సూర్యనగర్ గంగమ్మ సెంటర్లో కొలువై ఉన్న శ్రీడొడ్డి గంగమ్మ అమ్మవారికి దాతలు వెండి ఖడ్గానికి తొడుగును బహూకరించారు. యానాంశివారు కనకాలపేట గ్రామానికి చెందిన అడబాల మల్లి కార్జునరావు, గాలి దేవర చైతన్య, కరణం ప్రవీణ్ కుమార్, బర్రు వీర వెంకట సత్యనారాయణ, గొవింద మధుసూదన్‌రెడ్డి, ద్రోపవల్లి శ్రీనివాసరావు మిత్ర బృందం రూ.లక్షవిలువైన కిలో వెండితో చేయించిన అమ్మవారికి ఖడ్గానికి తొడుగుని అందజేశారు. పూజలు అనంతరం అమ్మవారికి అలంకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

బీబీ షకీనాకు ఘన నివాళి



బీబీ షకీనా వర్థంతిని పురస్కరించుకుని మజ్లిస్ ఆలపిస్తున్న మత గురువు

మామిడికుదురు, ఆగస్టు 11: ముస్లిం మతస్తుల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయురాలు బీబీ షకీనాకు భక్తులు ఘన నివాళులర్పించారు. బీబీ షకీనా వర్థంతి (షహదత్)ను పురస్కరించుకుని నగరంలోని బీబీ షకీనా పంజా వద్ద సంతాప కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా జరిగిన మజ్లిస్‌లో మత గురువు, మత ప్రబోధకుడు సయ్యద్ మహ్మద్ రజారజ్వీ మజ్లిస్ ఆలపించారు. మామిడికుదురులోని షియా జామియా మసీదులో నవ యువకుల ఆధ్వర్యంలో మజ్లిస్ జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఇమామ్ హుస్సేన్, అతని పరివారానికి అంజలి ఘటించారు. మజ్లిస్ అనంతరం బీబీ షకీనా పీరును మాతం చేస్తూ రక్తం చిందిస్తూ ఊరేగింపు నిర్వహించారు. పలు ముస్లిం భక్త బృందాలు భోజన సదుపాయం కల్పించాయి.

ఉచిత యోగా శిక్షణా తరగతులు

అంబాజీపేట, ఆగస్టు 11: శ్రీస్వామివివేకానంద యోగా ఆశ్రమం, యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ సమీపంలో ఉచిత యోగా శిక్షణా తరగతులు ప్రారంభించారు. యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. యోగాసనాలు, సూర్య సమస్కారాలు తదితర వాటిపై శిక్షణ ఇస్తామన్నారు.

ధాన్యం సొమ్ములు రైతులకు చెల్లించాలి

మండపేట, ఆగస్టు 11: ధాన్యం బకాయిలు రైతులకు వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏప్రిల్, మే నెలల్లో రైతులు అమ్మిన ధాన్యానికి ప్రభుత్వం నగదు ఇంకా జమ చేయలేదన్నారు. వ్యాపారుల నుంచి రైతులు వడ్డీలకు నగదు తీసుకుని పెట్టుబడులు పెడుతున్నారన్నారు.

డేటాఎంట్రీ ఆపరేటర్లను క్రమబద్ధీకరించాలి

ద్రాక్షారామ, ఆగస్టు 11: సమగ్ర శిక్షలో 21ఏళ్లుగా పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ల సర్వీసులు క్రమబద్ధీకరించాలని డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమావేశం కోరింది. ఆదివారం మండల విద్యావనరుల కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమావేశం జరిగింది. గత ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా జరిపిన సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, ఎంటీఎస్ అమలు చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లు డిమాండు చేశారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, బి.జాన్‌బాబు, ఎస్.సర్వేశ్వరరావు, కె.నాగమణి, అనంతలక్ష్మితులసి, కె.వీరపండు పాల్గొన్నారు.

కొమ్మూరి కుటుంబ సభ్యులకు ప్రముఖుల పరామర్శ



సత్యనారాయణమూర్తికి నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర నేత మెట్ల రమణబాబు

అల్లవరం, ఆగస్టు 11: కొమరగిరిపట్నానికి చెందిన విశ్రాంత గ్రామరెవెన్యూ సహాయకుడు కొమ్మూరి సత్యనారాయణమూర్తి(75) శనివారం మృతిచెందారు. సత్యనారాయణమూర్తి చిత్రపటం వద్ద టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తదితరులు నివాళులర్పించారు. కొమ్మూరి సత్తిబాబు సోదరులను పరామర్శించారు. గుర్రం ఏసుబాబు, మంతెన సురేష్‌రాజు, నల్లా స్వామి, బళ్ల సత్యనారాయణ, సంగీతం తాతాజీ, ఆకుల చంటి, ఆకుల రఘు, ఆర్ఐ మేడిద దుర్గాశ్రీనివాస్, యు.చిట్టిబాబు, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు కొమ్మూరి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ముమ్మిడివరం, ఆగస్టు 11: ముమ్మిడివరం మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కేవీ నరసింహారావు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



లూటుకుర్రు హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు, ఆగస్టు 11: లూటుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-85 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. కుటుంబ సమేతంగా కలుసుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. గురువులకు పాద పూజచేసి సన్మానించారు. కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

పి.గన్నవరం: ముంగండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివా రం పాఠశాలలో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసు కున్నారు. 18మంది గురువులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మా నించారు. ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ఆకుల నాగప్రసాద్, బొడ్డు రమాదేవి, విజయ్ కుమార్, మాచగిరి ఏడుకొండలు, వాసు కవిత, కళ్యాణి, విజయలక్ష్మి, రాధా కృష్ణ, సుబ్బరాజు, విత్తనాల మంగాలక్ష్మి సూజాత పాల్గొన్నారు.

18న తెలుగు భాషా దినోత్సవం



తెలుగు భాషా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, ఆగస్టు 11: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అమలాపురంలో ఈనెల18న తెలుగు భాషా దినోత్సవం, జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ తెలిపారు. అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ శతాధిక కవి సమ్మేళనం పోస్టర్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో మహేష్‌కుమార్‌ను శ్రీశ్రీ కళావేదిక తరఫున ఘనంగా సత్కరించారు. కవి సమ్మేళనంలో భాగంగా 175మంది కవులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించి సత్కరించనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, మహిళా కార్యదర్శి కుంపట్ల సుభాషిణి, జల్లి సుజాత, కడలి సత్యనారాయణ, పొలమూరి వెంకట్ పాల్గొన్నారు.

వైభవంగా కుచాలమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం, ఆగస్టు 11: కూళ్ల శివారు మల్లవరంలో కుచాలమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. జాస్తి సత్యనారాయణ చౌదరి శైలజారాణి దంపతుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా జరిపించారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ సీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను) తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

సోమేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి సుభాష్

రాయవరం, ఆగస్టు 11: సోమేశ్వరం శ్రీబాలా త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామిని ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, వేదపండితులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి అర్చనలు మంత్రి జరిపించారు. మంత్రి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

అదృశ్యమైన ఏఈ సురేష్ ప్రత్యక్షం

అమలాపురంటౌన్, ఆగస్టు11: ఉప్పలగుప్తం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పనిచేస్తున్న కె.సురేష్ ఆదివారం ప్రత్యక్షం కావడంతో ఫిర్యాదును కుటుంబ సభ్యులు ఉపసంహరించుకున్నట్టు అమలాపురం తాలూకా ఏఎస్ఐ గోపాలకృష్ణ తెలిపారు. ఉప్పలగుప్తం ఏఈగా పనిచేస్తున్న సురేష్ అమలాపురంరూరల్ మండలం కామనగరువులో నివాసం ఉంటున్నారు. ఈనెల10న ఇంటి నుంచి విధుల కోసం ఆయన బయలుదేరి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు ఏఈ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో సురేష్ ఉన్నారన్న సమాచారం రావడంతో బంధువులు అక్కడకు చేరుకుని ఇంటికి తీసుకువచ్చారు. కుటుంబ సమస్యల కారణంగానే ఏఈ సురేష్ అదృశ్యమైనట్టు సమాచారం.ఏఈ ఆచూకీ లభ్యం కావడంతో ఉదయం కుటుంబ సభ్యులు ఫిర్యాదును ఉపసంహరించుకున్నారని తాలూకా ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

ఉప్పలగుప్తం, ఆగస్టు 11: పంచాయతీ వనరుల కేంద్రం ఆదేశాల మేరకు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12నుంచి 14వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జరిగే శిక్షణా కార్యక్రమంలో సర్పంచ్‌లు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కె.గంగవరం: గ్రామసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం శిక్షణా తరగతులు ప్రారంభిస్తామన్నారు. మంగళవారం సాయంత్రంతో శిక్షణా తరగతులు ముగుస్తాయన్నారు.

రాయవరం: ఈనెల12 నుంచి 14వరకు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశపు హాల్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరం కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ ఇస్తామన్నారు.

జనసేన సమావేశం

అల్లవరం, ఆగస్టు 11: గోడితిప్ప గ్రామాభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే ఆనందరావు, సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి మధ్య సయోధ్య కోసం ఆదివారం గోడితిప్పలో జనసేన సమావేశం జరిగింది. ఎమ్మెల్యే కార్యక్రమాలపై తమకు సమాచారం అందడం లేదని సర్పంచ్ శ్రీదేవి, భర్త శ్రీనివాస్ చేసిన ఆరోపణలపై చర్చించి అందరూ సమైక్యంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో నల్లా శ్రీధర్, కంకిపాటి వీరబాబు, మేడిద శంకరరావు, పోలిశెట్టి బాబులు, గుర్రం కృష్ణ, చిట్నీడి శ్రీనివాస్, కంకిపాటి గోపి, పలచోళ్ల వేణు, చిట్నీడి చినవెంకన్న, పిండి గణపయ్య, రొక్కాల నాగేశ్వరరావు, కటికిరెడ్డి బాబి పాల్గొన్నారు.

మాల మృతవీరుల దినోత్సవం

రాజోలు, ఆగస్టు 11: తాటిపాకలో మాలల న్యాయ పోరాట సమితి జేఏసీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం మాల మృతవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. తాటిపాక సెంటర్‌లో ఉన్న పీవీ రావు విగ్రహానికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి లిఖితపూడి బుజ్జి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా బత్తుల మురళీకృష్ణ మాట్లాడుతూ మాల మృతవీరులైన శేషయ్య, నారాయణల ప్రాణ త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో బొంతు మణిరాజు, పోతుమూడి శేఖర్, ఉండ్రు జాన్, గెడ్డం రవి, చింతా మధుకుమార్, మందపాటి రాజేశ్వరరావు, పోతుమూడి రవికుమార్ పాల్గొన్నారు.

నాదెండ్ల పర్యటనను విజయవంతం చేయాలి

మలికిపురం, ఆగస్టు11: జిల్లాకు వస్తున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం చెప్పడానికి రాజోలు నియోజకవర్గంలోని కూటమి శ్రేణులు భారీగా తరలి రావాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం విశ్వేశ్వరాయపురంలో ఆయన ఇంటి వద్ద జరిగిన కూటమి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రేణులంతా సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఈతకోట రావాలని, అక్కడి నుంచి అమలాపురం భారీ ఊరేగింపుగా వెళ్లి మంత్రి పర్యటనను విజయవంతం చేద్దామన్నారు. గుండుబోగుల పెదకాపు, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, ఉండపల్లి అంజి, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, తాడి మోహన్, యింటిపల్లి ఆనందరాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	భవనమ్
శ్రీలలిత	కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	తుఫాన్
శేఖర్ స్క్రీన్-2	బడ్డీ
రమా	రాయన్
గణపతి	సూపర్ డీలక్స్
వెంకటపద్మావతిస్క్రీన్-1	కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	సింబా